క్లుప్తంగా

చెట్ల పెంపకంపై అవగాహన

ఈపూరు: మండల కేంద్రంలో అటవీయేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకం కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. రైతులకు అగ్రో ఫారెస్ట్ మీద అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో రంగనాయకులు మాట్లాడుతూ చెట్ల పెంపక ప్రాధాన్యత గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ట్రీస్ ఔట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టీఓఎఫ్ఐ) ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ మారపల్లి ప్రణీత్ వర్మ, ఎం. భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): స్టాప్ డయేరియాపై నూజెండ్ల మండలంలోని వి.అప్పాపురం పంచాయతీ ఎస్సీ కాలనీలో గల ఎంపీపీ పాఠశాలలో పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ద్రోణాదుల మనోహర్ జోషి, హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు షేక్ రసూల్, ఆశ కార్యకర్త సలోమి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట రూరల్: యల్లమంద ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శ్రీనివాస గిరిజన కాలనీలో ఈనెల 14వ తేదీ బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.ఎస్.రామకృష్ణయ్య మంగళవారం తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, రక్తహీనత, కీళ్లనొప్పులు, దీర్ఘ, తరుణ వ్యాధులకు ఉచితంగా పరీక్షించి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. శ్రీనివాస గిరిజన కాలనీతో పాటు పరిసర ప్రాంతాల వాసులు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్త నుంచి సంపద రాబట్టాలి

నాదెండ్ల: ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించినపుడే ప్రభుత్వ లక్ష్యమైన చెత్త నుంచి సంపద సాధ్యమౌతుందని ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద సృష్టిలో కనీసం నిర్వహణ ఖర్చులైనా రాబట్టాలని కోరారు. అనంతరం నాదెండ్లలో అమలౌతున్న ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో వైద్యశిబిరం

బొల్లాపల్లి: పశుగణాభివృద్ధి సంస్థ గుంటూరు, స్థానిక పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో పశువుల గర్భకోశ వ్యాధులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామంలోని 41 పశువులకు గర్భకోశవ్యాధులకు చికిత్స చేసి సూడి పరీక్షలు నిర్వహించామని పశువైద్యులు తెలిపారు. కార్యక్రమంలో గుమ్మనంపాడు పశువైద్యాధికారి డి.సాల్మన్‌సింగ్, పశువైద్యసహాయ సిబ్బంది, పశుయజమానులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు అరికట్టాలి



వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులను, మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులను అరికట్టాలని కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మా పార్టీ అధికారంలోకి వచ్చింది మీరు మానుకోండి మా వారిని మీరు చేస్తున్నటువంటి వర్క్ చేయించాలని రాజకీయ నాయకులు కార్మికులపై ఒత్తిడి తెచ్చి వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఊట్ల రామారావు, దూపాటి మార్కు, సోమవరపు దావీదు, కొప్పెరపు మల్లికార్జున, ఆంజనేయులు, సుబ్బారావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నరసరావుపేట రూరల్: మండలంలోని దొండపాడులో రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చెంచురెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందజేశారు. శిబిరంలో కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 125 మందికి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైద్యశిబిరంలో పాల్గొన్నారు.



హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. సత్తెనపల్లిరోడ్డులో గల కోటబజారు నుంచి గడియార స్తంభం వరకు నిర్వహించిన ర్యాలీకి యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అమరేంద్ర రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు దార వెంకట సుబ్బరాయ గుప్త, కవలకుంట జాన్‌బాబు నేతృత్వం వహించారు. నేషనల్ కౌన్సిల్ మెంబర్ కృపారావు, జిల్లా సంయోజక్ చిగురుపాటి ఆది నారాయణరావు, పాల్గొన్నారు. –నరసరావుపేట

స్విమ్మింగ్ పూల్‌లో...

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆజాదిక అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. స్విమ్మర్లు జాతీయ పతాకాన్ని చేతబూని స్విమ్మింగ్ పూల్‌లో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్, బీబీటీ సుందరి, కోచ్‌లు సి.హెచ్.శ్రీనివాసరావు, ఎం.సైదారావు, క్రీడాకారులు పాల్గొన్నారు. –నరసరావుపేట ఈస్ట్



చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెపొందించుకున్నప్పుడే వాటిని సద్వినియోగం చేసుకొనే అవకాశం ఉంటుందని చిలకలూరిపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ.స్వాతి చెప్పారు. పట్టణంలోని కుమ్మరకాలనీలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ కె.నరేంద్రరెడ్డి ఆదేశాల మేరకు దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. శారీరక, మానసిక దివ్యాంగుల్లో కొన్ని ప్రత్యేకమైన శక్తులు ఉంటాయని వాటిని తల్లిదండ్రులు గుర్తించి, ప్రోత్సహించినపుడే వారు జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, జీవీహెచ్ఎస్ ప్రసాద్, ఎం భానుప్రసాద్ పాల్గొన్నారు. –చిలకలూరిపేటటౌన్

బాధ్యత సర్పంచ్‌లదే

పంచాయతీలను అభివృద్ధి చేసే బాధ్యత సర్పంచ్‌లదేనని మండల పరిషత్ ఏవో సాయిశ్రీనివాస్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, కార్యదర్శులకు మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సోమవారం జీపీడీపీ, పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణతో పాటు మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. రెండోరోజు శిక్షణలో భాగంగా మంగళవారం వంకాయలపాడు డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఇళ్ల నుంచి చెత్తను సేకరించే ముందుగానే తడిపొడి చెత్తను వేర్వేరుగా అందించేలా వారిని చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరయ్యారు. –యడ్లపాడు



జోరుగా వరి నారుమళ్లు

- విత్తనాలు వెదజల్లుతున్న మాగాణి రైతన్నలు
- లభించని జేజీఎల్–384 వరి వంగడం



దమ్ము చేసిన వరినారుమడిలో విత్తనాలను వెదజల్లుతున్న రైతు

రొంపిచర్ల: మండలంలో ఈ ఏడాది సాగర్ కాల్వలకు సాగు నీరు విడుదల కావడంతో మాగాణి రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండగానే సాగర్ కాల్వలకు కూడా సాగునీరు విడుదల కావడంతో రైతులు వరి నారుమళ్ల సాగును ప్రారంభించారు. అయితే వ్యవసాయ భూములు కురిసిన వర్షపు చినుకులతో తేమ ఏర్పడటంతో మెట్ట వ్యవసాయానికి అనువుగా లేదు. దీంతో రైతాంగం బురద నారుమళ్ల సాగు వైపునకు మొగ్గుచూపుతున్నారు.

మెట్ట వరినారు మళ్ల సాగు రైతుకు అనువుగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో వీలుపడక బురద వరినారుమళ్ల సాగు చేస్తున్నారు. బురద వరి నారు మళ్ల సాగు వల్ల రైతుకు అదనపు ఖర్చు ఏర్పడింది. పొలంలో నారుమళ్లు సాగుచేసే ఏరియాకు నీరు పెట్టి ట్రాక్టర్‌తో రెండు మూడు పర్యాయాలు దమ్ము చేయిస్తున్నారు. అనంతరం వరి విత్తనాలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి ఆ విత్తనాలను గోనె సంచుల్లో మూటలు గట్టి 36 గంటల పాటు మొలక కడతారు. మొలక వచ్చిన విత్తనాలను నారుమళ్లలో వెదజల్లి 24 గంటల తర్వాత నారు మడిలో నీటిని బయటకు పంపుతారు.

అయితే మండలంలో 42,500 ఎకరాలు సాగు భూమి ఉండగా 30 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. గత ఏడాది వరి పంట లేకపోవటంతో ఈ ఏడాదికి వరి విత్తనాన్ని తయారు చేసుకోవడం రైతులకు వీలుపడలేదు. ఈ ఏడాది సాగు నీరు రావడం వల్ల విత్తనాలను సేకరించటంలో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. అయినప్పటికీ రైతులకు కావల్సిన జేజీఎల్–384 రకం వరి వంగడాలు లభ్యం కావడం లేదు. విత్తనం సరఫరా తక్కువగా ఉన్నందు వల్ల గిరాకీ ఏర్పడింది.

గత నెల చివరిలో రూ.1200 రూపాయలు ఉన్న జేజీఎల్–384 రకం విత్తనాలు ప్రస్తుతం రూ.2000 పెడుతున్నా దొరకని పరిస్థితి నెలకొని ఉంది. రైతులు ఈ విత్తనానికి ప్రత్యామ్నాయ విత్తనాలను సాగు చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శిక్షణా కేంద్రం ఉపసంచాలకులు శివకుమారి, నరసరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు మస్తానమ్మ తదితర అధికారులు మాచవరం, విప్పర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. జేజీఎల్–384 విత్తనాలకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ–1224, కేఎన్ఎం–1638 సాగు చేయాలంటున్నారు. ఈ రకాలు జేజీఎల్ కంటే అధిక దిగుబడి ఇవ్వడంతో పాటు చీడపీడల బారినుంచి కూడా తట్టుకుంటాయని వారు సూచిస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వం రాయితీపై అందించే ఆర్ఎన్ఆర్–14449, ఎంటీయూ–1121, బీపీటీ–5204, ఆర్ఎన్ఆర్–15048, ఎంటీయు–1271, ఎంటీయు–1282, ఎంటీయు–1262 రకాలను సాగు చేయవచ్చని సూచిస్తున్నారు. ఈ రకం వరి వంగడాలను రైతులకు అవసరమైతే రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకుంటే సబ్సిడీపై అందజేస్తామని అధికారులు తెలియజేశారు. ఏది ఏమైనా ఏడాది తర్వాత సాగు నీరు వస్తుండటంతో మాగాణి రైతాంగంలో ఆశలు చిగురించి విత్తనాల కోసం వేటను మొదలెట్టారు.

భారతదేశ గొప్పతనం చాటాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు
- పట్టణంలో 150 అడుగుల జాతీయజెండాతో విద్యార్థుల ర్యాలీ



గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: ప్రతిఒక్కరూ జాతీయ జెండా చేత పట్టి రోడ్డుపైకి వచ్చి దేశ గొప్పతనాన్ని చాటిచెప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మంగళవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో బాగంగా పల్నాడు రోడ్డులోని మున్సిపల్ హైస్కూలుకు చెందిన విద్యార్థులు 150 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చదలవాడ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ గడియార స్తంభం సెంటర్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావిపౌరులనీ, మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాబోవు రోజుల్లో గొప్ప ఇంజినీర్లు, డాక్టర్లు, మంచి రాజకీయ నాయకులుగా ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. డిప్యూటీ డీఈవో వేణుగోపాలరావు, సీసీఆర్టీ రీజినల్ సెంటర్ అధికారి శ్రీనివాసబాబు, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు టి.రవికాంత్, ఎంఇవో శివ నాగేశ్వరరావు, షేక్ జిలానిమాలిక్, కనుమూరి లక్ష్మి, బీబీటీ సుందరి, గాయకులు డప్పు శ్రీను, టీడీపీ నాయకులు కొట్ట కిరణ్, క్రాంతి, ప్రసాద్, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్ర పట్టణాల్లో నరసరావుపేటను నిలుపుదాం

పారిశుద్ధ్య నిర్వహణలో నియోజకవర్గాన్ని మహోన్నత స్థానంలో నిలిపేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని 14,34 వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు పాల్గొన్నారు. పరిశుభ్ర పట్టణాల జాబితాలో నరసరావుపేటను అగ్రస్థానంలో నిలిపే వరకు విశ్రమించేదిలేదన్నారు. మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో సదుపాయాల పరిశీలన

ప్రయాణికులకు సదుపాయాలు కల్పించడంలో అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ కోరారు. మంగళవారం రైల్వే స్టేషన్లో ప్రయాణీకులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.

ఇదేమి అరాచకం?!

- కాపాడిన వారిపైనే కేసులు పెట్టిస్తారా?
- బాధితుల చేత అబద్ధాలు చెప్పిస్తారా?
- టీడీపీ అరాచకాలు పెచ్చుమీరుతున్నాయి
- ఖండించిన నూజెండ్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వినుకొండ (నూజెండ్ల): నియోజకవర్గంలో టీడీపీ అరాచకాలు పెచ్చుమీరిపోతున్నాయని నూజెండ్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూజెండ్ల మండల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో వచ్చిన తరువాత రషీద్ హత్య, వెంకుపాలెం వద్ద ఒకరి కిడ్నాప్ ఇలా జరుగుతూనే ఉన్నాయన్నారు. నిన్న నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో షార్ట్‌సర్క్యూట్ వల్ల పూరిల్లు కాలిపోతే అందుకు నూజెండ్ల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాగిరెడ్డి కారణమని బలవంతంగా ఆ ఇల్లు కాలిపోయిన బాధితుల చేత చెప్పించడం దారుణమన్నారు. నాగిరెడ్డిపైన, ఆ మంటలను ఆర్పడానికి ప్రయత్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదన్నారు. అమాయకమైన పేదవారిని అడ్డు పెట్టుకొని తమపార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పొట్లపల్లి పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

తొమ్మిదో తరగతి విద్యార్థి అదృశ్యం

నాదెండ్ల: మండల కేంద్రమైన ఎస్సీ కాలనీకి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న పద్నాలుగేళ్ళ విద్యార్థి దావులూరి జాన్ సోమవారం ఉదయం కనిపించకుండా పోయాడని తండ్రి చినవీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చినవీరయ్య కూలి పనులు చేసుకుంటూ ఇరువురు కుమారులను చదివిస్తున్నాడు. పెద్దకుమారుడు గుంటూరు సమీపంలోని ఓ అకాడమీలో చదువుతుండగా, రెండో కుమారుడు జాన్ నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం అన్న వద్దకు వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చాడు. 11 గంటల సమయంలో బైక్ తీసుకుని వెళ్ళి తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ ఫీల్డ్ విజిట్



ఈపూరు: గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా 2వ రోజు ఎస్‌డబ్ల్యూపీసీ ఫీల్డ్ విజిట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ఎ.వి.రంగనాయకులు పాల్గొని వర్మికంపోస్టు తయారు చేసే విధానం గురించి అవగాహన కల్పించడం జరిగింది. పంచాయతీల్లో సంపదను ఎలా సృష్టించాలో వివరించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి జి.వెంకటేశ్వర్లు, ఏవో రవికుమార్, క్లాప్ మిత్రలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్లలో ఓ మోస్తరు వర్షం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయానికి మండల కేంద్రమైన రొంపిచర్లలో 4.4 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు.

డాక్టర్ అంజిరెడ్డి ఆస్పత్రిలో అరుదైన గుండె ఆపరేషన్

75 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా మరోమారు బైపాస్ సర్జరీ



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శబరి గిరీష్

నరసరావుపేట: ఏడేళ్ల క్రితం బైపాస్ సర్జరీ చేయించుకున్న వ్యక్తికి మళ్లీ గుండెనొప్పి రావడంతో అతడికి అరుదైన ఆపరేషన్‌తో స్టంట్ వేసి ప్రాణాలు కాపాడినట్లు డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ ఎండీ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హాస్పిటల్‌లో విలేకర్లకు వివరాలు తెలిపారు. పట్టణానికి చెందిన 75 ఏళ్ల నాగేశ్వరరావు తీవ్రమైన గుండె నొప్పి రావటంతో తమ హాస్పిటల్‌ను సంప్రదించారన్నారు. ఈ పేషెంట్‌కు 2016న బైపాస్ సర్జరీ జరిగిందన్నారు. ఈ పేషెంట్‌కి రక్తనాళంలో ఫాస్ఫేట్ పేరుకుపోయి రక్తనాళం నుంచి రక్తం సరఫరా కాకపోవటంతో తీవ్రమైన గుండె నొప్పి వచ్చి ప్రాణాపాయస్థితికి కారణమైందన్నారు. గుండె వైద్యులైన డాక్టర్ కోట శబరిగిరీష్ రోటబ్రేటర్ అనే అత్యాధునిక వైద్య పరికరంతో రోటాబ్రేషన్ యాంజియో ప్లాస్టి అనే ప్రపంచ స్థాయి వైద్య పద్ధతితో ఆపరేషన్ చేసి పేరుకుపోయిన రక్తనాళాలకు ఎటువంటి డామేజ్ కలగకుండా శుభ్రంచేసి స్టంట్ అమర్చి ఆపరేషన్ విజయవంతం చేశారన్నారు. దీంతో రోగి ప్రాణాలు నిలిచాయన్నారు. ఇలాంటి అరుదైన ఆపరేషన్ పల్నాడు జిల్లాలో తమ హాస్పిటల్‌లో మాత్రమే చేశామన్నారు. గుండెకు సంబంధించిన వైద్యసేవలు పల్నాడుతో పాటు పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

15న ఈఎన్‌టీ ఉచిత వైద్యశిబిరం



సమావేశంలో డాక్టర్లు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీవర్షిణి

నరసరావుపేట: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో నిర్వహించే ఈఎన్‌టీ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ అధినేత, రెడ్‌క్రాసు జిల్లా అధ్యక్షుడు కంజుల జగన్ మోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత 24 ఏళ్ల నుంచి జాతీయ దినాల సందర్భంగా తమ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా చెవి, ముక్కు, గొంతు సమస్యలకు ఉచితంగా వైద్యం చేసి అవసరమైన మందులు ఇస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. చెవిటి మెషీన్‌లను 30 శాతం రిబేట్‌పై అందజేస్తామన్నారు. ఈ నెల 15న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈనెల 17 నుంచి 20 వరకు అన్నీ ఈఎన్‌టీ సర్జరీలు ఉచితంగా చేస్తామన్నారు. కావున చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో డాక్టర్ శ్రీవర్షిణి పాల్గొన్నారు.

జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పేట విద్యార్థులు సత్తా

విజేతలను అభినందించిన పలువురు పెద్దలు

చిలకలూరిపేట: జాతీయస్థాయిలో మార్షల్ ఆర్ట్స్‌లో పట్టణ వాసులు సత్తాచాటారు. సాయి సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ వెంకట్ ఆధ్వర్యంలో విజయవాడచెన్నుపాటి రామలింగయ్య మునిసిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పట్టణంలోని సీఆర్ క్లబ్‌లోని న్యూషావోలిన్ కుంగ్‌ఫూ అకాడమీ, పోలిరెడ్డిపాలెంలోని రెండోబ్రాంచ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా పోటీల్లో పేట విద్యార్థులు అద్భుత ప్రతిభను చాటి అకాడమీ నుంచి 20 మంది, బ్రాంచ్ నుంచి ఐదుగురు విద్యార్థులు కటా విభాగంలో 18 బంగారు, 5 రజత, 2 కాంస్య పతకాలు సాధించారు. అలాగే బ్రౌన్ బెల్ట్ స్పారింగ్‌లో సయ్యద్ మొహమ్మద్ తన్వీర్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన వారిలో పవన్ కుమార్, ఎస్తేరు రాణి, పూజిత, శ్రీవత్సవ్, గౌరి, తాహీర్, తేజ, మోవాక్, రిత్విక, పమైలా, గౌతమ్, హమీద్ బాషా తదితరులు ఉన్నారు. స్థానిక సీఆర్‌క్లబ్ ఆవరణలో మంగళవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజేతలతో పాటు క్లబ్ పెద్దలు సాధినేని హనుమంతరావు, నర్రా కాళిదాసు, డాక్టర్ చేబ్రోలు మహేష్, వైద్యులు లావు సతీష్, ఎం వంశీకృష్ణ, స్వర్ణ శ్రీనివాస్ సత్కరించి బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ చీఫ్ షేక్ దరియావలి, మాస్టర్‌లు బత్తుల విక్రమ్, యడ్ల సురేష్, పాలపాటి నాగరాజు, కొరప్రాటి రాంబాబు, షేక్ రబ్బాని, ఎం.దుర్గా ప్రసాద్, కె రాహుల్, బ్లాక్ బెల్టర్స్ సాకేత్, సుధీర్, ఖమ్రుద్దీన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


ఉచిత పశువైద్య శిబిరం

శావల్యాపురం: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పశువైద్యశాల పరిధిలో గర్భకోశ వ్యాధుల చికిత్స పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువైద్యాధికారులు సోముల గుణధీర్, పాలపర్తి గణేష్ కుమార్‌లు పాల్గొని 32 పాడి గేదెలకు గర్భకోశ వ్యాధులు పరీక్షలు నిర్వహించి మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈశిబిరంలో వెటర్నరీ అసిస్టెంట్ బుల్లె య్య, సుందరయ్య, ఏహెచ్ఏ బలరాం, ట్రైనీ ఏహెచ్ఏ మేఘన, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

విధులు-నిధులు తెలుసుకోండి


వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల గ్రామంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు రీఫ్రెషర్ ట్రైనింగ్ క్లాసులు 2వ రోజు నిర్వహించారు. శిక్షణలో ఎంపీడీవో టి.వీరభద్రాచారి పాల్గొని మాట్లాడుతూ కార్యదర్శులు, సర్పంచ్‌ల విధులు, నిధులు గురించి, అధికారాల గురించి తప్పనిసరిగా తెలుసుకొని ఉండాలని తెలిపారు. గ్రామాల్లో గ్రామసభల నిర్వహించి గ్రామాభివృద్ధికి తోడ్పడేలా చూడాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగుకు ఆసక్తిచూపాలి




శావల్యాపురం: రానున్న రోజుల్లో ప్రతి కుటుంబం క్యాన్సర్, షుగర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన ఆహార పదార్థాలు తినాలని మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసమాఖ్యా సంఘాల్లోని మహిళా సభ్యురాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటిలోని మహిళలు ఆకుకూరలు, కూరగాయాలు పెరటి తోటల్లో పెంచుకొని వాటికి సహజంగా లభించే ఘనజీవామృతం, తదితర వాటితో సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏస్ఏఫ్ఏ సైదయ్య, ఏపీయం జి.వాసుబాబు,సీసీలు బేబీరాణి,రమాదేవి, ఖాజావలీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పత్తిపంటలో ఆ మందులు వాడితే ప్రమాదమే



యడ్లపాడు: ప్రత్తి పంటలో సింథటిక్ పెరిత్రాయడ్ మందులు వినియోగించరాదని, వీటివల్ల పంటలో రసంపీల్చే పురుగులు ఉధృతి పెరిగే ప్రమాదం ఉందని జిల్లా వనరుల కేంద్రం నుంచి డీడీఏ ఎం శివకుమారి, ఏవో డి.ప్రవీణ్ తెలిపారు. మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం వారు పలు పంటల్ని పరిశీలించారు. స్థానిక రైతులకు అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించారు. ఆత్మవారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆయా కార్యక్రమాల్లో పత్తి, మిరప, మాగాణుల్లో వచ్చే సమస్యలు, వాటి పరిష్కారాలపై సలహాలు, సూచనలు చేశారు. మారుతున్న వాతావరణం ఆధారంగా సాగులోనూ మార్పులు చేసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



రొంపిచర్ల: స్థానిక భగత్ సింగ్ భవన్‌లో మండలంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు దుర్వ్యసనాలు–దేశ ప్రగతిపై వాటి ప్రభావాలు అంశంపై మంగళవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. వ్యాసరచన పోటీల్లో 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ముఖ్య కార్యదర్శి సరికొండ రామకృష్ణం రాజు మాట్లాడుతూ సమ సమాజ స్థాపన, దేశ భవిష్యత్ యువత సామర్థ్యంపై ఆధారపడి ఉంటుందన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాస రచన పోటీలు నిర్వహించామన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో యువత మత్తు పదార్థాలకు బానిసలై పెడదోవ పడుతున్న తీరు బాధాకరమన్నారు. యువత క్రమశిక్షణ నియమాలు అలవర్చుకోవాలన్నారు.